# ప్లేగు

**టెలిప్రింటర్ టకటక శబ్దం చేస్తోంది. అప్పుడే ఆఫీస్ నుంచి వచ్చిన మెసేజ్‌ని ఆపరేటర్ వినోద్ తీసి నా చేతికిచ్చాడు. ఏదో ప్రెస్ నోట్‌ను వార్తగా రాస్తున్న నేను తలెత్తి మెసేజ్ చదివాను.**

"టు ది స్టాఫ్ రిపోర్టర్ ఆదిలాబాద్, ఫ్రం న్యూస్ కోఆర్డినేటర్, హైదరాబాద్.... ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూరు సమీపంలోని ధనోరా గ్రామంలో ప్లేగు వ్యాధి సోకి ఒకరు మరణించారని హైదరాబాద్‌లో అధికారులు తెలిపారు. మరణించిన వ్యక్తి సూరత్ నుంచి వచ్చినట్లు అనుమానిస్తున్నారు. మీరు వెంటనే ఆ గ్రామం వెళ్ళి పూర్తి వివరాలతోపాటు, వీలుంటే అతడి ఫోటో కూడా తీసి పంపించండి. న్యూస్ ఫస్ట్ ఎడిషన్‌కు అందేలా రాత్రి ఎనిమిది గంటలలోపు పంపించడం మరచిపోవద్దు" అని ఉంది.

మెసేజ్ చదువుతుండగానే నా నుదుట చెమట పట్టేసింది. టైం చూసుకున్నాను. పదకొండు గంటలు. మెసేజ్ అంతక్రితం రాత్రి టిపి సెక్షన్‌లో ఇచ్చిందై ఉంటుంది. పొద్దున టిపి ఆన్ చేయగానే పంపించారు.

నేను పనిచేస్తున్న పత్రిక ఆఫీసులో పద్ధతులు, బాస్‌లు, వారి మూడ్స్ తెలిసిన నాకు ఈ మెసేజ్ వింతేమీ కాదు. ఉట్నూరు ఆదిలాబాద్‌కు 60 కిలోమీటర్లు ఉంటుంది. అక్కడి నుండి ధనోరా మరో 20 కిలోమీటర్లు. అంతదూరం వెళ్లి వివరాలు సేకరించి రాత్రి ఎనిమిదికల్లా ఫోటోలతో సహా వార్త పంపడం ఏమాత్రం వీలయ్యే పని కాదు.

ఆదిలాబాద్ జిల్లా గురించి తెలిసిన వారెవరూ ఇలాంటి మెసేజ్ పంపరు.

మిగతా జిల్లాల పరిస్థితి వేరు, ఇక్కడ వేరు. ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వెళ్ళే నాగపూర్ జాతీయ రహదారి పరిస్థితే అధ్వాన్నంగా ఉంటుంది. ఈ రోడ్‌పై 20 కిలోమీటర్ల దూరంలో గుడిహత్నూర్ నుండి తూర్పు వైపు 40 కిలోమీటర్లు వెళితే ఉట్నూరు, ఈ మధ్యనంతా సింగిల్ రోడ్, ఎదురుగా మరో వాహనం వస్తే మొదటి వాహనం పూర్తిగా రోడ్ దిగి ఆగాల్సిందే. పైగా గతుకుల మయం.

అన్నిటికన్నా బస్ ఫ్రీక్వెన్సీ బొత్తిగా తక్కువ. ఎపుడో నాలుగైదు గంటలకొక ఎక్స్‌ప్రెస్ తప్ప మిగతా అన్నీ ఆర్డినరీ బస్‌లే. ఉట్నూరు నుండి జోడేఘాట్ వెళ్ళేదారిలోని ధనోరాకు రోజూ పొద్దున, సాయంత్రం మాత్రమే బస్‌లు ఉంటాయి. మిగతా టైంలో వెళ్లాలంటే ఏ లారీలో, ఐ.టి.డి.ఎ. వారిజీపులు తప్ప మరో గత్యంతరం లేదు.

ఇలా ఆలోచిస్తూ కూర్చున్ననేను చప్పున స్పృహలోకి వచ్చాను. లాభంలేదు. ఏ కారణం చేతైనా వార్త రాత్రికల్లా పంపకపోతే తెల్లారి ఆఫీస్ నుండి స్ట్రాంగ్ డోస్ ఎలా ఉంటుందో తెలుసు. కనుక తక్షణం కదలకపోతే కనీసం ధనోరా వెళ్లడం కూడా సాధ్యం కాదు. వెంటనే లేచి హ్యాండ్ బ్యాగ్‌లో ఆటోమేటిక్ కెమెరా, నోట్‌బుక్ పెట్టుకున్నాను. ధనోరా వెళ్లానని ఆఫీస్‌కు మెసేజ్ పంపమని ఆపరేటర్‌కు చెప్పి బస్టాండ్‌కు బయల్దేరాను.

అక్కడ ఓ అరగంట వెయిట్ చేశాక లక్సెట్టిపేట ఫాస్ట్ ప్యాసింజర్ బస్ వచ్చింది. తెలిసిన ఫ్రెండ్ సీట్లు ఆపడంతో బస్‌లో కూర్చునేందుకు వీలుకలిగింది. లేకుంటే బిలబిలమంటూ డోర్ ముందు మూగే జనాన్ని తోసుకుంటూ వెళ్లి బస్‌లో సీటు సంపాదించడం నాకు మరో ఇరవై ఏళ్లకు కూడా సాధ్యం కాదు. సీటు దొరికినా జనం కిక్కిరిసి తోసుకురావడంతో ఇబ్బంది తప్ప లేదు.

బస్ వేగంగా అడవి మధ్య నుండి దూసుకెళుతూంది. ఈ జిల్లాకు ట్రాన్స్‌ఫర్ అయిన తరువాత గత రెండేళ్ళలో నాకు ప్రశాంతత లభించింది ఈ అడవుల్లోనే. పట్టణం పొలిమేరలు దాటి బయటకు రాగానే బాల్య మిత్రుల్లా పలకరిస్తూ నవ్వే రకరకాల చెట్లు, కొండలను చూస్తే అప్పటివరకు పడిన ఆవేదనంతా చేత్తో తీసినట్టుపోతుంది.

తల్లి చంకలోంచి తొంగిచూసే పసిపాపల్లా చెట్లకొమ్మల సందుల్లోంచి బెదురుగా చూసే జింకలు, దుప్పులు, నెమళ్లను చూస్తే మైమరచిపోకుండా ఉండటం కష్టం. కొంచెంసేపు వాటి వైపు చూస్తే చాలు అడవిలోకి తుర్రుమంటాయి. వాటిని ఫోటో తీద్దామని చాలాసార్లు ప్రయత్నించినా నాకెపూడూ సాధ్యం కాలేదు.

అడవి అందాల గురించి చిన్నప్పటి నుండి చదవడమే కాని దగ్గరుండి చూడటం నాకు ఆదిలాబాద్‌లోనే, అయితే ఇక్కడి అడవులు, జీవితం అంతా రొమాంటిక్‌గా లేదని కూడా ఇక్కడికొచ్చాకే అర్థమయింది.

వేలాది ఎకరాల్లో నరికిన చెట్ల బోదెలు తప్ప అడవి ఆనవాళ్ళు కన్పించవు. అడవుల నరికివేత, స్మగ్లింగ్ వెనుక పెద్ద తలకాయల అండదండలున్నాయి. కానీ జిల్లాకు వచ్చాక కలప అక్రమ రవాణాకు సంబంధించి రాసిన ఇన్‌వెస్టిగేటివ్ స్టోరీపై ఒక జిల్లా రాజకీయ నాయకుడు పంపిన పరువునష్టం దావా నోటీసు ఇంకా ఆఫీస్‌లోనే ఉంది. నోటీసు ఇచ్చాక ఆరు నెలలకు కూడా కేసు వేయకపోవడానికి కారణం కేవలం బెదిరించడమే. అతడి ఉద్దేశ్యమని నాకు తెలుసు. అయితే మా న్యూస్ కోఆర్డినేటర్ గిరి మాత్రం నేను హైదరాబాద్ వెళ్లినపుడల్లా ఈ నోటీసు ప్రస్తావన తెచ్చి గాభరా పడిపోతుంటాడు.

బస్ గతుకుల రోడ్డు మీద ఎగిరి పడుతుండటంతో ఆలోచనల్లోంచి తేరుకుని చూశాను. గుడిహత్నూర్ దాటి ఉట్నూరు వైపు మళ్ళింది. ఇంద్రవెల్లి వరకు రోడ్ ఇంతే. తరువాత కొంత నయం.

ఈ వర్షాకాలంలో రోడ్డంతా కొట్టుకుపోయి రాళ్లు తేలి ఉంటుంది. అసలు వానాకాలంలో ఆదిలాబాద్ జిల్లా మారుమూల ప్రాంతాలకు సాధారణంగా ఎవరూ పోరు. చాలా స్కూళ్ళు, ప్రైమరీ హెల్త్ సెంటర్‌లు వానలు వచ్చాయంటే మూతబడిపోతాయి. వాగులు పొంగి పొర్లితే బస్‌లు బంద్.

ఉన్నట్టుండి ఈ ప్లేగు ఎందుకు వచ్చిపడిందో... దశాబ్దాల కింద పోయిందనుకున్న ప్లేగు మళ్ళీ రావడమేమిటి? అది ఏ మారుమూల అడవుల్లో కాకుండా సూరత్‌లో రావడం, ఒక్కసారి అంతమంది జనం చనిపోవడం, వేలాదిమంది అక్కడి నుండి పరారుకావడం అంతా గందరగోళంగా ఉంది. ఒక్కవారం రోజులలోనే దేశంలో అన్ని వార్తలను కిందికి తోసేసి ప్లేగు ఒక్కటే పతాక శీర్షికలకెక్కింది! ప్రపంచ దేశాలన్నీ ప్రవర్తిస్తున్న పద్ధతి చూస్తే దేశంలోని ఎనభై కోట్లమందికీ ప్లేగు వచ్చినట్లే ఉంది. ఎంత ఆశ్చర్యం! ఎంత అన్యాయం? ఒక్కసారిగా మనసంతా అదోలా అయిపోయింది.

ఆదిలాబాద్ పట్టణంలో నాలుగైదు రోజులుగా మందుల షాఫ్‌ల ముందు టెట్రాసైక్లిన్ కోసం విపరీతమైన రద్దీ. అది కూడా చాలినన్ని దొరకడం లేదు. డబ్బున్నవారు హైదరాబాద్, నాగపూర్‌ల నుండి తెచ్చుకుంటున్నారు. రెండు రూపాయల



క్యాప్సుల్ ధర ఆరు. ఏడు రూపాయలకు పెరిగింది. అంతడబ్బు పెట్టి క్యాప్సుల్స్ కొనుక్కోలేని పేద జనమే నిశ్చింతగా కన్పిస్తున్నారు.

ఎక్కడో సూరత్‌లో బతుకు తెరువు కోసం వెళ్లిన వ్యక్తి అక్కడ మృత్యువు కోరల్లో చిక్కి పుట్టిన ఊరు ధనోరాకు వచ్చి చావడం ఎంత హృదయ విదారకరం! బహుశా అతను ఏ బట్టల మిల్లులో కూలీయో అయిఉంటాడు. అతనికి భార్య పిల్లలు ఉన్నారో, ఒంటరివాడో,యువకుడో, వృద్ధుడో. నేను వెళ్లేసరికి అతని అంత్యక్రియలు పూర్తయితే కనీసం అతడి భార్య పిల్లల ఫోటోలైనా తీసుకోవాలి.

ధనోరా చాలా చిన్న గోండుగూడెం. అక్కడి సర్పంచ్ భీంరావు నాకు బాగా తెలుసు. పోయిన నవంబర్‌లో ఆ ఫూళ్లో ఐ.టి.డి.ఏ. ఏర్పాటు చేసిన రుణాల పంపిణీ కార్యక్రమానికి ప్రాజెక్టు ఆఫీసర్‌తో ప్రెస్ రిపోర్టర్లమంతా వెళ్లాం. ఆ రాత్రి భీంరావు ఇంట్లోనే మాకు భోజనం, బస ఏర్పాటు. ఎంతో ఆదరంగా ఆతిధ్యమిచ్చిన భీంరావును మరచిపోవడం కష్టం. డెబ్బైఏళ్లకు పైబడినా అంత వయసువాడిలా కనబడడు. అతను ఆ తరువాత ఒకటి, రెండుసార్లు ఉట్నూర్‌లో కలిసినపుడు ధనోరాకు రావాలని ఆహ్వానించాడు. అయినా వెళ్లడం వీలు కాలేదు.

ఇంతలోనే బస్ ఉట్నూరులో ఆగింది. బస్ దిగి చూశాను. బస్టాండ్ పక్కనేగల గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న మరో దినపత్రిక స్థానిక విలేఖరి కరీం నన్ను చూసి పలకరించాడు.

ఏవిటీ ఉప్పగా ఉంది? కోపంగా అడిగాడు భర్త. చమటోడ్చి చేశానండీ సమాదానం చెప్పింది భార్య.

ఎన్. మురళీమోహన్
నరసన్నపేట

రంగనాథ్ : హలో అప్పారావు మారుతి కారు కొన్నావట.
అప్పారావు : నడుచుకుంటూ వెళుతుంటే అప్పులవాళ్లు వెంటబడుతున్నారు. అందుకే కారుకొన్నాను.

బాబూరావు
పెద్దకొత్తపల్లి



ఇంతలోనే బస్ ఉట్నూరులో ఆగింది. బస్ దిగి చూశాను. బస్టాండ్ పక్కనేగల గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మరో దినపత్రిక స్థానిక విలేఖరి కరీం నన్ను చూసి పలకరించాడు.

"ధనోరాలో ప్లేగుతో ఎవరైనా చనిపోయినట్లు తెలుసా?" అడిగాను.

"లేదే. మాకెవరికీ ఇక్కడ తెలియదు. అయినా గోండు గూడెంలలో ఏం జరిగేది అక్కడికి వెళ్తేకాని తెలియదు" అన్నాడు కరీం. ధనోరా వెళ్లడానికి ఏమిటి మార్గం అంటూ ఇద్దరం కలిసి కాసేపు ఆలోచించాం.

అప్పటికి టైం మూడు గంటలు. ఆ సమయంలో అటువైపు ఏ వాహనమూ వెళ్లదు. ఐ.టి.డి.ఏ. జీపు నెలరోజుల నుండి రిపేర్‌లో ఉందని కరీం చెప్పాడు.

నాలో పెరిగిపోతున్న టెన్షన్ గమనించిన కరీం వెంటనే ఊళ్లోకి మాయమై మరో పావుగంటలో ఒక లూనాతో వచ్చాడు. ధనోరా వెళ్లగలనన్న నమ్మకం రావడంతో రిలీఫ్‌గా ఊపిరి పీల్చుకోగలిగాను. పక్కనే ఉన్న కిరాణా స్టోర్‌లో కిరోసిన్ కల్తీ కలిసిన మూడు లీటర్ల పెట్రోల్ పోయించుకుని ధనోరా దారి పట్టాను.

పూర్తిగా దుబ్బ రోడ్డు, లూనా పాతది కావడంతో రకరకాల ధ్వనులు వస్తున్నాయి. కంకర తేలిన రోడ్డును వదిలి మట్టితో చదునైన పక్కదారి వెంట బండి నడవడం నాకు సాధ్యం కావడం లేదు.

కొట్టివేసిన అడవిలో అక్కడక్కడ కొద్దిగా పెరిగిన ఎండిన పొదలు. చిన్నచిన్న గులకరాళ్లు, మట్టి దిబ్బలు తప్ప పచ్చదనం ఎక్కడా లేదు. అక్కడక్కడ మొలిచిన గడ్డి తింటున్న పశువులు తప్ప జన సంచారం బొత్తిగా లేదు. ఆ రోడ్ మీద అలా గంటసేపు ప్రయాణం చేశాక ధనోరా వచ్చింది.

ఊరి బయట ఒంటి మీద బట్టలు లేకుండా ఆడుకుంటున్న నలుగురైదుగురు చిన్న పిల్లలు లూనా చూసి ఆట ఆపి ఆశ్చర్యంతో నిల్చుండిపోయారు.

వాళ్ల సాయంతో భీంరావు ఇల్లు కనుక్కోగలిగాను. మధ్యాహ్నం నాలుగు గంటలు. అక్టోబర్ మొదటివారంలో కూడా వేసవిని గుర్తు చేసే ఎండలు కాయడంతో బాగా అలసిపోయాను. ఇంటి ముందు కూర్చున్న ముసలావిడ లోపలికి వెళ్లి చెప్పాక భీంరావు బయటికి వచ్చాడు.

"ఎవరూ..." అని మెల్లగా వచ్చి నన్ను చూశాక గుర్తుపట్టి "అరె... మీరా రాం... రాం... రండి" నులక మంచం వాల్చి కూచోబెట్టాడు. తాను మరో మంచం వాల్చుకున్నాడు.

ముసలావిడ తెచ్చిన మంచినీళ్లు తాగాక నేను వచ్చిన పని చెప్పాను. మళ్ళీ వెళ్లడానికి టైం చాలదన్న ఆదుర్దాలో నేను భీంరావుతో మామూలు కుశల ప్రశ్నలు కూడా అడగలేకపోయాను.

కొద్దిసేపు మౌనంగా తలవంచుకుని తరువాత 'ఔను. పిలేగుగురించి నేను విన్నాను. కానీ ఊళ్లో పిలేగుతో ఇంతవరకు ఎవరూ చావలేదు" అన్నాడు భీంరావు.

"మా ఆఫీస్ నుండి మెసేజ్ వచ్చింది. హైదరాబాద్‌లో ఆఫీసర్లు చెప్పారట ధనోరాలో ప్లేగుతో ఒక వ్యక్తి చనిపోయాడ"ని అన్నాను.

"హైదరాబాద్‌లో ధనోరా గురించి మాట్లాడుకుంటున్నారా సార్" ఆశ్చర్యంగా అడిగాడు భీంరావు. తిరిగి "అసలు ఈ ఊళ్లో నెల్లాళ్లుగా ఎవరూ పోలేదే మరి!" అన్నాడు. దానితో ధనోరాలో ప్లేగుతో ఎవరూ మరణించలేదని నాకు రూఢి అయింది. ఏం చేయాలిపుడు?

"పోనీ ధనోరా వారెవరైనా సూరత్‌లో ఉన్నారా? ఎవరైనా అక్కడి నుండి మూడు నాలుగు రోజుల్లో ఊరు వచ్చారా?"

"ఔ, ఔ, లచ్చిబాయి కొడుకు రాంరావు నాలుగేండ్ల కింద సూరత్ పోయిండు. కాని ఇంతవరకు మల్ల ఊరు రాలేదు. ఆ ఇంట్లో లచ్చిబాయి ఒక్కతే ఉంటుంది. పొద్దున కూడా కన్పించింది" బదులిచ్చాడు భీంరావు.

చుట్టుపక్కల ఊళ్లలో కూడా ప్లేగుతో గతవారం రోజుల్లో ఎవరూ మరణించలేదని కూడా భీంరావు మాటలను బట్టి అర్థమయింది.

ఇక్కడ ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని నేను ఊహించలేదు. నేను అన్యమనస్కంగా ఉన్నానని గమనించిన భీంరావు మెల్లగా "కాని సార్! రెండు మూడేళ్ల నుంచి కొండ జూరం (అతిసారవ్యాధి) వచ్చి చుట్టుపక్కల గూడాలలో ఇప్పటివరకు ముప్పైమంది పిల్లలు, ఆడోళ్ళు పోయిండ్రు. కానీ పేపరోల్లు ఎవలూ వచ్చి రాసుకోలేదు" అన్నాడు. నాకేమనాలో అర్థం కాలేదు. మళ్ళీ "రెండు నెల్ల కింద ఈ గూడెంలోనే జీజాబాయి ఇద్దరు పిల్లలు గత్తర (కలరా) సోకి చచ్చిండ్రు. జీజాబాయి పిచ్చిదైపోయింది. మేత్తం కొడుకు కూడా గత్తరలో పోయిండు. ఏడాది నించి అడగంగ పక్కవూరు రాంపూర్‌లో దవాఖానా తెరిచిండ్రు. కానీ నాలుగు నెల్లనుంచి అక్కడ మందు అచ్చేటోల్లు ఎవరూ లేరు" అని భీంరావు అంటున్నపుడు గొంతులో జీర స్పష్టంగా విన్పించింది. రెండు నిముషాల మౌనం తరువాత మెల్లగా హ్యాండ్‌బ్యాగ్ తీసుకుని లేచాను. ఆ రాత్రికి అక్కడ ఉండమని బతిమాలినా అతడి నుండి సెలవు తీసుకోవడం కష్టమైంది.

పార్క్‌చేసిన లూనా వరకు నాతో నడుస్తూ "అంతే కాదు సార్. చుట్టు ఉన్న అడవిని పారెస్టోల్లు, కంట్రాక్టర్లు నరుకుతుండ్రు. ఎన్నడూ లేనిది రెండేళ్ల నుంచి చిరుతలు, ఎలుగులు గూడేల మీదికి రాబట్టినై. రాంపూర్‌లో, చినకవ్వాల్‌లో ఆరుగురు పిల్లలను బట్టినై. జరమీరు పేపర్ల పెద్దగా రాయండి సార్" అని భీంరావు అభ్యర్థనాపూర్వకంగా నా చేతులు పట్టుకున్నాడు.

ఓదార్పుగా అతని భుజాలుపై చేయి ఉంచాను.

"పిలేగు పుణ్యమా అని మీరు మా వూరు వచ్చిండ్రు. జర మా వూరు గురించి రాయండి సార్" అంటూ భీంరావు వీడ్కోలు పలికాడు.

లూనా రోడ్డెక్కడంతో స్పీడు పెంచాను. ఆఫీసు కెళ్లాక ఏం రాయాలో తోచడం లేదు. ధనోరాలో రకరకాల రూపాలలో ప్రతిధ్వనిస్తున్న మృత్యుదేవత వికటాట్టహాసం నా చెవుల్లో మారుమోగుతుంది.

ఇంతకూ నేను వచ్చిన పని పూర్తయిందా? లేదా తేల్చుకోలేకపోతున్నాను.

★